క్లుప్తంగా

సిమెంటు దిమ్మెను ఢీకొట్టిన కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మేదరమెట్ల: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో సిమెంటు దిమ్మెను కారు ఢీకొట్టింది. ఈఘటన కొరిశపాడు మండలం పీ.గుడిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా లక్ష్మీపురం నుంచి చిలకలూరిపేటకు వెళ్తున్న కారు పీ.గుడిపాడు జాతీయ రహదారి అత్యవసర విమానాల ల్యాండింగ్‌పైకి రాగానే కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి లక్ష్మీపురానికి చెందిన ధీరజ్ అని సమాచారం. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొక్కజొన్నలో చీడపీడల నివారణ


మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో

బల్లికురవ: ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పైరుకు చీడపీడలు ఆశించాయని వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న, కంది పైర్లను ఆమె పరిశీలించారు. మొక్కజొన్నను మొవ్వ పురుగు ఆశించిందని నివారణకు కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలు ఎకరాకు 3–4 కేజిలు మొదలుకు దగ్గరలో వేయాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, ఎరపంటగా పొలం చుట్టూ బంతి, ఆముదం నాటుకోవాలని కుమారి వివరించారు. ఈపరిశీలనలో వీఏఏలు రోజా, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



కార్మికులకు సామగ్రి అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో మున్సిపల్ సంచాలకులు ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు డస్ట్‌బిన్లు, చీపుర్లు, పుష్ కాట్లు, పారలు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పురప్రజలు అనారోగ్యాలకు, సీజనల్ వ్యాధులకు గురికాకుండా చెత్తకుప్పలను తొలగించి మురుగునీటి పారుదల సక్రమంగా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

చినగంజాం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కో ఆర్డినేటర్ ఎస్ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చినగంజాంలో అడ్మిషన్ పొందవచ్చని హెచ్ఎం డి.రత్నకుమారి తెలిపారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, 14 సంవత్సరాలు నిండితే 10వ తరగతి, పది పాస్ అయితే ఇంటర్ పరీక్షలు రాసుకోవచ్చని, ఒకే సిట్టింగ్‌లో ఇంటర్ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం 99081 64379 నంబర్‌లో సంప్రదించాలని వారు ప్రకటనలో కోరారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


పోలేరమ్మ అమ్మవారు

యద్దనపూడి: మండలంలోని వింజనంపాడు గ్రామంలో శుక్రవారం పోలేరమ్మతల్లి, పోతురాజు స్వామి, శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రక్షాసూత్ర పూజ, అఖండస్థాపన, యంత్రబింబ సంస్కారములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం దుర్మార్గం

- అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం.
- నివాళి అర్పించిన వైఎస్సార్ సీపీ నేతలు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జంజనం, పార్టీ నాయకులు

చీరాల: అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. విజయవాడ నడిబొడ్డులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహాశిల్పాన్ని ఏర్పాటు చేశారన్నారు. జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని దాడిచేసి ధ్వంసం చేయడం దుర్మార్గమని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం అండతో విగ్రహాన్ని దాడిచేసి ధ్వంసం చేయడంతో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు, మున్సిపల్ చైర్మన్, దళిత నాయకులు, ఇతర నాయకులు రాజ్యాంగ నిర్మాతకు క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అందరివాడైన అంబేడ్కర్ విగ్రహాన్ని సుత్తులతో, రాడ్లతో టీడీపీ నాయకులు ధ్వంసం చేయడం, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దాడులు పెరిగిపోయాయని, చాలామందిని దారుణంగా హతమార్చారన్నారు. టీడీపీ నేతల ఆగడాలు, ఘర్షణలు పెరిగిపోతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించకుండా కాలయాపన చేస్తూ కేవలం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను హింసించడమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు తమ రాజకీయ స్వార్థం కోసం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంశం చేయడం వారి నీచ సంస్కృతికి, దురహంకార పాలనకు తార్కాణమన్నారు. ఇకపై అంబేడ్కర్ జోలికి, తమ పార్టీ అధినేత జగనన్న జోలికివస్తే ఉపేక్షించమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, పార్టీ యూత్ విభాగం కార్యదర్శి యాతం మేరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.వెంకటేశ్వర్లు, బి.అనిల్, చీమకుర్తి బాలకృష్ణ, పార్టీ నాయకులు వాసిమళ్ల వాసు, శ్రీను, గోసాల అశోక్, హచ్ రమేష్, శిఖా సురేష్, గిరికుమార్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

నేటికి, రేపటికి దర్పణం 'నేటి నిజం కావ్యం'


కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు, సాహితీవేత్తలు

అద్దంకి: చెన్నుపాటి రామాంజనేయులు రచించిన 'నేటి నిజం కావ్యం' నేటికి, రేపటికి దర్పణమని సాహితీవేత్త బీరం సుందరరావు అన్నారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన చెన్నుపాటి రామాజంనేయులు పద్య కావ్యం 'నేటి నిజం, అమెరికాలో నా అనుభవాలు' కావ్య ఆవిష్కరణ, చెన్నుపాటి రామాంజనేయులు, రాజ్యలక్ష్మి వివాహ స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. ఈసభకు శతాధిక గ్రంథకర్త ప్రముఖ కవి పి.సౌభాగ్య అధ్యక్షత వహించారు. గ్రంథాన్ని సినీ నటుడు తిలక్ ఆవిష్కరించారు. సౌభాగ్య తన అధ్యక్ష తొలిపలుకుల్లో నేటి నిజం గ్రంథం ప్రజల సమస్యల్ని పరిష్కారాన్ని చూపించే గొప్ప పుస్తకమన్నారు. వేమన శతకం లాంటి ప్రజా సాహిత్య వరుసలో ఈ కావ్యం చేరుతుందని చెప్పారు. అమెరికాలో రామాంజనేయులు తనకు పరిచయం అయ్యారని చెప్పారు. నేటినిజం పుస్తకంలో రక్త కన్నీరు సంభాషణలు కొన్ని చదివి వినిపించారు. అనంతరం రచయిత బీరం సుందరరావు మాట్లాడుతూ సమాజంలో నిత్యం జరిగే ఘటనలను తనదైన విమర్శనా పద్ధతిలో చెన్నుపాటి పద్య రచన సాగించారని చెప్పారు. తరువాత ఏపీటీఎఫ్ తెలంగాణ పూర్వ అధ్యక్షుడు కె వేణు గోపాల్, ప్రసిద్ధ అనువాద రచయిత అనిశెట్టి శంకర్ కథా రచయిత్రి తుర్లపాటి లక్ష్మి, ఎస్వీ రాఘవయ్య, చెన్నుపల్లి నాగేశ్వరరావు ప్రసంగించారు. చివరగా గ్రంథ రచయిత చెన్నుపాటి రామాంజనేయులు మాట్లాడుతూ నాడు వేమన, బద్దెన, తదితర కవులు నాటి సమాజంలోని నిత్యం జరిగే అంశాలు, తమ స్వీయ అనుభవాలనే పద్యాలుగా రాశారని గుర్తు చేశారు. అయితే అవి ఆ నాటి వ్యావహారిక భాషలో ఉన్నాయని, నేను అదే వరుసలో నేటి ప్రజలకు అర్థం అయ్యే విధంగా వ్యవహారిక భాషలో పద్యాల రచన చేశారని చెప్పారు. గ్రాంథిక పదాలు అందరికీ అర్థం కావన్నారు. పదిమందికి అర్థం కాదనిచెప్పారు. చెన్నుపాటి రామాంజనేయులు కుమారులు చైతన్య డాక్టర్ నవీన్ అతిథులను సత్కరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


నాయకుడిని పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: కార్యకర్తలకు అండగా ఉంటానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను, నాయకులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల బైకు ప్రమాదంలో గాయపడ్డ వైఎస్సార్ సీపీ నాయకుడు మారం జయరామిరెడ్డిని రామ్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అద్దంకి మండలంలోని కొటికలపూడి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు ఉన్నం పేరయ్య సతీమణి సుధారాణిని పరామర్శించారు. తదుపరి బల్లికురవ మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో వివాహ వేడుకలకు హాజరై వధువరులు శ్రీకాంత్, మానసలను ఆశీర్వదించారు. ఈకార్యక్రమాల్లో పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వాడకం నేరం

- బల్లికురవలో 36 టీమ్‌ల విస్తృత తనిఖీలు
- 59 మందిపై కేసుల నమోదుతో రూ.1.77 లక్షల పెనాల్టీ


విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్ఈ, ఈఈలు

బల్లికురవ: విద్యుత్ అక్రమ వాడకం చట్టరీత్యా నేరమని నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామని ఆ శాఖ విజయవాడ ఎస్ఈ ఆల్‌ఫ్రాన్స్, ఒంగోలు డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కట్టా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవలో 36 బృందాలు దుకాణాలు, గృహాలు, పరిశ్రమలల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఈ, ఈఈలు విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ ట్యాంపరింగ్, ఆదనపు లోడు వినియోగించటం, స్తంభాలకు లూటి కర్రలు ఏర్పాటు చేసుకోవటం నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రతి నెల వినయోగించిన లోడుకు సంబంధించి బిల్లులు చెల్లిస్తూ, విద్యుత్ సమస్యలు ఉంటే మండల స్థాయిలోని ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్ దృష్టికి తెచ్చుకుని పరిష్కరించుకోవాలన్నారు. తనిఖీలో భాగంగా 59 మందిపై కేసుల నమోదుతో రూ. 1.77 లక్షల పెనాల్టీ విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీలో అద్దంకి ఈఈ ఎన్ మస్తాన్‌రావు, మార్టూరు డీఈ ఎం సురేంద్రబాబు, బల్లికురవ ఏఈ కె.శ్రీనివాసరావు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.విద్యుత్ మరమత్తుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని 7 సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిషాద్‌నాజ్

చీరాల రూరల్: ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌నాజ్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వీఆర్‌అండ్‌వైఆర్‌ఎన్ ఇంజినీరింగ్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రస్తుత యువతరంతో పాటు విద్యార్థి లోకం యావత్తు ఫ్యాషన్ ప్రపంచంలో మునిగిపోతున్నారని, సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌ల వాడకం ఎక్కువగా ఉందని చెప్పారు. అంతేకాక వాటిలో ముఖ్యమైన చెడు వ్యసనాలు గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను అంధకారమయం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలానే ర్యాగింగ్ జోలికి వెళ్లవద్దని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని పిల్లలను కష్టపడి చదివిస్తుంటే పిల్లలు మాత్రం వారి మాటలు వినకుండా చెడు మార్గంలో పయనిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాది ఎ. రామకృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జీకే ఈశ్వరి రెడ్డి, విద్యా సంస్థల సీఈవో రామకృష్ణ, ప్రిన్సిపల్ రవికుమార్, టౌటౌన్ ఎస్సై ఎ. వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర సమస్యలను త్వరితంగా పరిష్కరించి సేవలను సకాలంలో అందిస్తానని నూతన తహశీల్దార్ కె.గోపీకృష్ణ అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం చేజర్ల మండలానికి బదిలీ అయ్యారు. కొద్దిరోజుల క్రితం నిర్వహించిన తహశీల్దార్ల బదిలీల్లో చీరాల తహశీల్దార్‌గా గోపీకృష్ణను నియమించారు. బాధ్యతలు చేపట్టిన నూతన తహశీల్దార్‌కు డీటీ సురేష్, రీసర్వే టీడీ అర్జున్, కార్యాలయం ఉద్యోగులుతో పాటుగా పలు గ్రామాల వీఆర్వోలు పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పరంగా అందాల్సిన రెవెన్యూ సేవలను త్వరితంగా అందించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది, వీఆర్వోలు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత అభినందనీయం


వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న క్లబ్ సభ్యులు

చినగంజాం (పర్చూరు): వృద్ధాశ్రమానికి చేయూతనివ్వడం అభినందనీయమని రోటరీ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో భవాని మహిళా మండలిచే నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధుల అవసరాల నిమిత్తం రూ.8500 విలువ గల డైనింగ్ టేబుళ్లను తోకల మౌనిక బహూకరించారు. అలాగే సూపర్‌స్టార్ మహేశ్‌బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు, సభ్యులు అందరూ కలిసి వృద్ధులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, హరిప్రసాదరావు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దురుసు ప్రవర్తన తగదు

చీరాల రూరల్: కక్షిదారులకు న్యాయ సహాయం అందించడంలో నిరంతరం పాటుపడే న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం వారిపై అక్రమ కేసులు బనాయించడం తగదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. నంద్యాల బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న పి.సుబ్బరామిరెడ్డిపై నంద్యాల టూటౌన్ సీఐ దురుసుగా ప్రవర్తించి అవమానపరచిన ఘటనను నిరసిస్తూ శుక్రవారం చీరాల న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాద అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, ఉదయ భాస్కరరావులు మాట్లాడుతూ ఐదు రోజులు క్రితం మంగళగిరి, గుంటూరు నగరాలలోని న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడటాన్ని మరువకముందే మళ్లీ నంద్యాలలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న సీనియర్ న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై అక్కడ టూటౌన్ సీఐ దురుసుగా ప్రవర్తించి అతని కాలర్ పట్టుకుని లాక్కుని వెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. పోలీసులకు కోర్టులన్నా, న్యాయవాదులన్నా ఏ మాత్రం గౌరవం లేదన్నారు. కక్షిదారుల వెంట పోలీసు స్టేషన్‌కు వెళ్లే న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ అవమానపరుస్తున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇదేవిధమైన వైఖరి అవలంభిస్తే భవిష్యత్‌లో పోలీసులు, న్యాయవాదుల మధ్య తీవ్ర అఘాతం ఏర్పడుతుందని వారు హెచ్చరించారు.

బైకు-టిప్పర్ ఢీ

బల్లికురవ: బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టటంతో ఓవ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈఘటన శుక్రవారం సాయంత్రం బల్లికురవ–సంతమాగులూరు ఆర్ అండ్‌బీ రోడ్డులోని మల్లాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. గాయాలపాలైన బైకిస్టును స్థానికులు హుటాహుటిన నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డివిజన్ డిప్యూటీ డీఈవో కార్యాలయం మార్పు

చీరాల టౌన్: ఇప్పటివరకు పర్చూరులో నిర్వహించిన చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం శుక్రవారం నుంచి చీరాలకు మార్పు చేశారు. కొత్త జిల్లాల విభజనలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉప విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని మండలంలోని ఈపురుపాలెం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేశామని డిప్యూటీ డీఈవో ఎ.నిర్మల తెలిపారు. చీరాల ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం ప్రారంభంలో చీరాల డివిజన్ పరిధిలోని పలు జిల్లా పరిషత్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్, జి.శ్రీనివాసరావు, కృష్ణమోహన్, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని డిప్యూటీ డీఈవోకు పుష్పగుచ్ఛాలు అందించారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు

యద్దనపూడి: తొలి శ్రావణ శుక్రవారం మరియు నాగులపంచమి పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేషపూజలు నిర్వహించారు. నాగపంచమి సందర్భంగా శివాలయాల్లో భక్తులతో సందడిగా మారాయి. శ్రావణశుక్రవారం సందర్భంగా అమ్మవారికి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పూనూరులోని త్రిపురాంతక స్వామి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, గన్నవరం కాశీ అన్నపూర్ణాదేవి, జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు, అభిషేకాలు నిర్వహించారు.

బల్లికురవ: శ్రావణమాసంలో వరాలిచ్చేతల్లి లక్ష్మీదేవి శివకేశవులను ఆరాధిస్తే అన్ని శుభాలతో పాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు వీ.సుబ్రమణ్య శర్మ, ఐ సుబ్బాచార్యులు, పీ. పవన్ కుమార్‌శర్మ అన్నారు. మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలో వాడవాడలా మహిళలు అమ్మవారి విగ్రహాల ఏర్పాటుతో పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర పూజలు చేపట్టారు. ముత్తైదువలకు వాయిన దానాలిచ్చారు. కొత్తపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం గ్రామాల ఆలయాల్లో పూజలు చేపట్టారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు..

వేటపాలెం: ఆణుమల్లిపేట లోగల మహాలక్ష్మమ్మ మందిరం వద్ద శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 32 మంది సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు చుండూరి రాజ్యలక్ష్మి, మంజుల, ప్రత్తి అనంతలక్ష్మి పాల్గొన్నారు.